# ఆమె మనసు



పెద్దింటి విజయలక్ష్మి

ఆరేళ్ళ చిట్టిబాబు, మొహంనిండా దిగులు పులుముకుని, దుఃఖం ముంచేసినట్టు కూర్చున్నాడు – యింటి బయట అరుగుమీద !

అటుగా వచ్చిన జానకి అడిగింది, "చిట్టిబాబూ, ఏమ్మా అలా వున్నావు ?" అని.

జానకి వంక తిరిగి, ఆమె నొకసారి చూసి, మోకాళ్ళ సందులో మొహం దాచేసుకున్నాడు చిట్టిబాబు.

చిట్టిబాబుని అలా చూసిన జానకికి, వాడి చేతలు వింతగా నవ్వు పుట్టించినా, వెంటనే జాలితో ఆమె గుండె కరిగి పోయింది.

వాడికి దగ్గరగా వచ్చింది జానకి. దాచుకున్న వాడి మొహాన్ని పైకి తీయబోయింది కానీ, వాడు అలాగే బిగుసుకున్నాడు. అది చిట్టిబాబు చిలిపిచేష్టగా భావించి ఫక్కున నవ్వేసింది జానకి.

"అబ్బో, దొరగారికి అలుక చాల పెద్దదేనే" అంది, వాడి రెండు రెక్కలూ పట్టి పైకి తీస్తూ.

"ఒద్దత్తా, నేను రాను" అంటూ మారాం చేశాడు చిట్టిబాబు చిట్టి బాబు మొహాన్ని దగ్గరగా, పరిశీలనగా చూడ గలిగిన జానకి, నివ్వెరపోయింది!

చిట్టిబాబు బుగ్గమీద గిచ్చినట్టు ఎర్రగావున్న వేలిముద్ర, ఏడ్చినట్టు కన్నీటి చారికలు!

దీనంగా అగుపించిన చిట్టిబాబుని చూసి, జానకి మనస్సు కలుక్కుమంది.

"ఏంటి బాబూ, ఏమైంది?" తన ఆదుర్దాని అణచుకోలేక ఆతృతగా అడిగింది.

ఎప్పుడోగాని ఎరుగని ఆ ఆప్యాయతకు, ఆరేళ్ళ చిట్టిబాబు కూడ దుఃఖాన్నాపుకోలేకపోయాడు.

"అత్తా" అంటూ జానకిమీద వాలిపోయాడు. జానక్కి కూడ దుఃఖం వచ్చినంత పనైంది!

చుట్టూ చూసింది. ఏ అలికిడీ లేదు. చిట్టిబాబు యిలా ఏడుస్తుంటే వాళ్ళమ్మ ఏమైనట్టు? వచ్చి సముదాయించదేం?" అనుకుంది. మనసులో ఆమెమీద కోపం పుట్టింది.

"అమ్మేది బాబూ?" రుద్ధకంఠంతో చిట్టిబాబు తల నిమురుతూ అడిగింది.

చిట్టి బాబు యింకా మాట్లాడగలిగే స్థితికి రాలేదు రెండుచేతులతో కళ్ళు తుడుచుకుంటూ, వెక్కుతున్నాడు. వాడి ఎర్రబడ్డ బుగ్గని, దుఃఖం నిండిన వాడి మొహాన్ని చూసి, జానక్కి కూడ మాట పెగల్లేదు. కూడదీసుకుని, "దా, లోపలికి పోదాం. నిన్ను మీ అమ్మొచ్చి పిలిచేదాక వెళ్ళొద్దులే" అని, బలవంతాన వాణ్ణి ఎత్తుకుని, తన యింట్లోకి తీసుకొచ్చుకుంది.

"ఇదుగో, నీకోసం ఏం తెచ్చానో చూశావా? 'కేక్' అంటే నీకిష్టంకదూ! ఇంద తీసుకో" అని ప్లేట్లో కేక్ వాడి ముందు పెట్టింది జానకి.

నిజంగానే, కేక్‌ని చూడగానే నోరూరింది చిట్టిబాబుకి. మెల్లిగా మనసు మార్పు చెందింది. సిగ్గుగా, కేక్‌ని ఓసారి, జానకిని ఓసారి చూశాడు. "తీసుకో బాబూ" అని జానకి యింకోసారి చెప్పగానే, గబుక్కున చిట్టిబాబు చేయి 'కేక్'ని పట్టుకుంది.

దాంతో తన బాధని మర్చిపోయిన వాడిలా, చిట్టిబాబు 'కేక్'ని అటు యిటు తిప్పి చూసుకుంటూ, కేక్ తింటుంటే, ఆ పసితనపు అమాయకత్వాన్ని చూస్తూ కూర్చుంది జానకి.

తిన్న తర్వాత, బుగ్గలకూ, పెదాలకు అంటుకున్న కేక్‌ని తుడుచుకుంటూ, "అత్తా నీళ్ళియ్యవా" అని అడిగాడు జానకిని.

వాడికి తనదగ్గర వున్న చనువుకి పుప్పొంగిపోయింది జానకి మనసు.

"ఇదుగో, యిక్కడే పెట్టాగా" అంటూ, ప్రక్కనే వున్న నీళ్ళగ్లాసు అందుకుని, వాడి కిచ్చిందామె.

నిన్ను అలా బుగ్గ మీద ఎవరు గిచ్చారు?"
అని అడిగింది.

మర్చిపోయిన సంగతిని గుర్తుచేసి నట్టుగా అయింది చిట్టిబాబుకి. అందులో తాను శిక్ష పొందాడు. దాన్ని గురించి



చిట్టిబాబుకి కొంత వుపశమనం కలిగింది. జానకికి వుబలాటం పెరిగింది.

"ఆఁ, యిప్పుడు చెప్పు, యిందాక అలా ఏడుస్తూ కూర్చున్న వెందుకూ?

చెప్పాలంటే, ఎందుకో సిగ్గు వేస్తూంది, వెంటనే వాడి ముఖ కవళికలు మారిపోయాయి.

జానకి అది గమనించింది. కానీ,

ఆమెకు విషయమేదో తెలుసుకోవాలన్న పట్టుదల. అందుకే, "ఫరవాలేదు చెప్పమ్మా, నీకేం భయం లేదుగా" అని బుజ్జగించింది.

చిట్టిబాబు చెప్పడం మొదలెట్టాడు.

"మరేఁ, మరేఁ, నాన్నగారి ఆఫీసు కాగితమని నాకుతెలీదత్తా. దాంతో పడవేసి నీళ్ళల్లో పెట్టి ఆడుకుంటున్నాను. మా అన్నయ్య చూసి, నాన్నతో చెప్పేశాడు. భయమేసి. ఆ కాగితం పడవ నీళ్ళలోనుంచి తీసి, ఆరబెట్టాను కూడ. కానీ, అంకెలన్నీ పోయాయి. నాన్నగార్కి కోపం వచ్చి, గిచ్చారు గట్టిగా కొట్టారు."

ఆ మాటలు పూర్తిచేసేలోపుగానే, వాడి దుఃఖం గొంతుకలో కొచ్చేసింది. పూర్తిచేసేసి, మళ్ళా ఏడవటం మొదలెట్టాడు వాడు. చిట్టిబాబుని మనసారా చేరదీసిన మహిమేమో, జానకి వాడి దుఃఖాన్ని చూడలేకపోయింది.

"మరి మీ అమ్మ నాన్నగార్ని ఏమన లేదా బాబూ?" అంది అమాయకంగా.

అప్పటికే వాడు జానకి ఒడిలోకి వచ్చేశాడు !

"లేదత్తా, అమ్మ కూడ నన్నే తిట్టింది. అందుకే అరుగు మీదకి వచ్చి కూర్చున్నాను" అన్నాడు ఏడుపులో ఏడుపుగా.

పిల్లల మనస్తత్వం తెలుసుకోకుండా, పసికందులకు జన్మనిచ్చిన చిట్టిబాబు తలితండ్రులను కసిదీరా మనసులోనే దూషించింది జానకి.

చిట్టిబాబు తండ్రి ఓ స్వల్ప జీతగాడు. అతనికి ఆర్గురు పిల్లల్లో చిట్టిబాబు ఆఖరువాడు. ఆఖరివాడై పుట్టి నందుకు వాడిలో అంత బలంలేదు గానీ, వాడి కళ్ళల్లో కళ, ముఖంలో వర్చస్సు జానకిని ఆకట్టుకున్నాయి. తెల్లగా, ఎలాంటి బట్టలు వేసినా, జానకి కళ్ళకు ముద్దొస్తున్నట్టుంటాడు చిట్టిబాబు. రెండు కుటుంబాలూ ప్రక్క ప్రక్కనే కాపురం వుంటున్నాయి కాబట్టి, చిట్టిబాబుతో జానకి స్నేహం రోజు రోజుకీ పెరిగింది. జానకికి కూడ యిద్దరబ్బాయిలున్నారు. వాళ్ళు పెద్దవాళ్లు. వేరే వూళ్ళో కాలేజీలో చదువు కుంటున్నారు. అప్పుడప్పుడు సెలవులకి వచ్చి పోతుంటారు. తన పిల్లలు పెద్ద వాళ్ళైన తర్వాత, జానకికి మరలా చిన్న పిల్లలమీద మక్కువ ఏర్పడింది. తనతో చేరినపిల్లల్ని ఆదరిస్తుంది. కానీ, తనకూ, చిట్టిబాబుకీ ఏనాడు స్నేహం కలసిందో, ఆనాటి మహిమ తమ యిద్దర్నీ మరీ సన్నిహితుల్ని చేసింది. ఒక్కొక్కసారి 'వాడు తన పెంపుడు బిడ్డనా' అని కూడ అనిపించకపోలేదు ఆమెకు ! దానికి ఆమె 'పెద్ద మనసే' కారణమేమో !

చిట్టిబాబు యిలా అప్పుడప్పుడు వాడి అమ్మా నాన్నల కోపానికి గురౌతూనే వుంటాడు. చిన్నతనం, తెలియక ఏదో

తప్పుచేస్తాడు. కఠినంగా శిక్ష అనుభ విస్తాడు. చిట్టిబాబంటే తనకు ప్రత్యేకం గానీ, ఆర్గురు పిల్లలున్న అతని తలితండ్రులకి ప్రత్యేక తేమిటి! ఆఖరికి, ఆఖరుగా పుట్టినవాడన్న ముద్దుకూడ లేదు వాళ్ళకి. డబ్బు చాలక, సమస్య లెక్కువై, భార మెక్కువై, చాలీ చాలని జీవితం గడపటానికి కూడ గగనమై పోయిన వాళ్ళింట్లో, ఒకర్నొకరు హింసించుకుంటూనే రోజులు గడువు కొస్తున్నారు. చిట్టిబాబు తల్లితో ఏవో నాలుగు మాటలు మాట్లాడి, ఆమెకు తెలియనివి తెలియజెపుతామని అనుకుంటుంది జానకి కానీ, ఆమె యింట్లోనుంచి బయటికే రాదు. వచ్చినా, ఎదురుగావున్న మనిషిని కన్నెత్తి కూడ చూడదు. ఇలాంటి యిల్లాలిని మార్చటం బ్రహ్మతరం కాదనుకుంది జానకి.

కానీ, చిట్టిబాబు మీద వున్న ప్రేమ కొద్దీ, వాడి పెంపకం తాను వహించి, వాణ్ణి తీర్చిదిద్ది, వాడి భవిష్యత్తుని ఎంతో వుజ్జ్వలంగా చేయాలనుకుంటుంది అప్ప డప్పుడు జానకి! ఏమిటో! వాళ్ళిద్దరి అనుబంధమూ, ఏ జన్మ సంబంధమో అన్నట్టుగా విచిత్రంగా వుంటుంది.

ఒకసారి, తన పిల్లలు వచ్చినప్పుడు కూడ, చిట్టిబాబు తనతోనే ఎక్కువ సేపు గడపటం వాళ్ళు గమనించి, "అమ్మా యీ అబ్బాయేంటే నీ కొంగు వదట్లంలేదు. నీ పెంపుడు కొడుకా ఏమిటి" అంటూ పరిహాసమాడారు.

వాళ్ళ మాటలు పరిహాస పలుకులే అయినా, జానకి అందులో లీనమైనట్టు సంతోషించింది. చిరునవ్వు నవ్వేది.

కానీ, చిట్టిబాబుకి తల్లిదండ్రు లున్నారు. ఎంతైనా, పగలంతా తనతో వుండగలడు గానీ, రాత్రయ్యే వేళకి వాడు వాళ్ళింటికి వెళ్ళక తప్పదు. తాను మనసారా ఎంత చేరదీసినప్పటికీ వాడు తన బిడ్డ కాదు. అయినా, తన కెందుకీ పిచ్చి? ఎవరి అదృష్టం వాళ్ళదని ఉండకూడదూ? అనుకుంటుంది. మరలా, "యింత పెద్ద సంసారంలో వీడి బ్రతుకు ఎలా వుంటుందో ఏమో అని మనసు బాధ పెట్టుకుంటుంది. ఆ విధంగా ఓ రెండు సంవత్సరాలు చిట్టిబాబు, జానకి కలసి వుండటంలో, యిద్దరి మధ్యా ఓ బంధం ఏర్పడినట్టు అయింది చిట్టిబాబుని ప్రక్కన కూర్చోబెట్టుకుని, ఆమె చదువు నేర్పించేది. మంచి మంచి నీతి కథలు చెప్పేది. లెక్కలు నేర్పేది. వాడు ప్రదర్శించే తెలివితేటలకు ఎంతగానో సంతోషించేది! ఇలాగే వీడు పెద్ద వాడయ్యేవరకూ తన దగ్గరే వుండిపోతే, వీడి భవిష్యత్తు ఎంతో బాగుంటుందని అనిపించింది మళ్ళా జానకికి.

కానీ, అదే కుదరలేదు. రెండేళ్ళకే వాళ్ళ అనుబంధానికి పరిమితి దాటి పోయినట్టు వచ్చిపడింది 'ట్రాన్స్ఫర్ ఆర్డరు'! జానకి మనసు అల్లకల్లోలమై పోయింది. కన్నబిడ్డకు దూరమయ్యే

టప్పుడు కలిగే బాధ, ఆమెలో కలిగింది. చిట్టిబాబుని యికనుంచి అంతలా చేరదీయకూడదనుకుంది. వాడికి కొంచెం కొంచెం దూరంగా వుండటం కూడ మొదలుపెట్టింది. వాడికి ఎలా తెలిసిందో "అత్తా నువ్వు యింకో వూరు వెళ్తావంట కదా, నేనూ రావద్దా నీతో" అని అడిగాడు ఒకనాడు.

జానకికి కన్నీటి పర్యంతం అయింది. "అలాగే బాబూ...అని వాడితో అంది గానీ, భర్తతో నిన్నటి సంభాషణ గుర్తుకొచ్చింది ఆమెకు.

"ఏమండీ, చిట్టిబాబుని మనతో తీసుకెళ్ళి, బాగా చదివిద్దామండీ. వాళ్ళని అడగండి, కాదనరు, నాకు తెలుసు. నేను లేకపోతే వాడు బెంగపెట్టుకుంటాడు," అని అంది.

ఆమెకేమీ ఆశ్చర్యం కలుగలేదు యిలా అన్నందుకు కానీ, ఆమె భర్త కనబొమలు పైకి తీశాడు. ఆ తర్వాత, సినిమాలో హీరోలా అంచెలంచెలుగా నవ్వి, "మతి చలించలేదుకదా జానకీ. కాశికి వెళుతూ పిల్లిని చంకన బెట్టుకున్నట్టు..."

భర్త మాటలు పూర్తిగా వినలేదు జానకి. అక్కడినుంచి వెళిపోయింది. ఆ తర్వాత, భారమైన మనసుతో, చిట్టిబాబుని వదిలి వెళిపోయింది ఆ వూరి నుంచే!

చిట్టిబాబు మొదట కొన్నాళ్ల 'అత్త' కోసం ఆరాటపడ్డాడుగానీ, కాలచక్ర పరిభ్రమణంలో తన వాళ్ళతో కలసిపోయాడు.

* * *

జీవితాలు కథలుగా, కథలు జీవితాలుగా మారి మారి మరి కొంత కాలం కాలచక్రంలో కలసిపోయింది. జానకమ్మ నాయనమ్మ అయిపోయింది. ఆమె తలలో అక్కడక్కడా తెల్లవెంట్రుకలు కనిపించాయి. మంద చూపుని మాన్పడానికేమో, కళ్ళకి జోళ్ళు పెట్టుకుంది. మనిషిలో ఓ నిండుదనం, ఓ హుందాతనం వచ్చింది. పిల్లలు పెద్దవాళ్ళయి పిల్లలకు పిల్లలు పుట్టారు. ఎన్నో సంఘటనలు, ఎన్నో సమస్యలు, మంచివి, చెడువి అన్నీ కొంతవరకు చవిచూసిన జానకమ్మ, గొప్ప అనుభవజ్ఞురాలిలా అయింది.

కానీ, చెప్పుకోతగ్గ గొప్ప విషయం యీనాటికీ చిట్టిబాబు ఆమె మస్తిష్కంలో స్థిరంగా నిలచివున్నాడు. సందు చిక్కినప్పుడల్లా, "ఎలా వున్నడో, ఎంత వాడయ్యాడో" అనుకుంటూనే వుంటుంది. మనసు ఓ పరిపక్వానికి వచ్చిన తర్వాత చిట్టిబాబు ఆమె మనస్సు నాశ్రయించాడు కాబట్టి, ఆమె మనసులో చిరస్థాయిగా నిలవగలిగాడు.

కాని, చిట్టిబాబు కిది ఏ నాటి సంఘటనో. అసలిలాంటిది జరిగిందన్న గుర్తు, జ్ఞానము లేని వయస్సది. 'అంత

చిన్నవయస్సులో తన కిలాంటి ఓ సన్నిహితురాలుండేది' అన్న మాటే తెలియని వాడయ్యాడు చిట్టిబాబు! పసితనంలో తనకెంతో అండగా నిలచిన జానకిని యిట్టే మర్చిపోయాడు!

అనుకోకుండా ఒకటిగా, ఒకే వూరికి ప్రయాణం చేశారు జానకమ్మ, చిట్టిబాబు.

అతన్ని చూడగానే జానకమ్మ మనో చక్రం అతివేగంగా వెనక్కి తిరిగింది. "చిట్టిబాబు" అంటూ మనసు ఆనందపరవశమైంది. మనిషి, ఎదిగి, యువకుడైనందువల్ల అతనిలో మార్పు వచ్చినా, ఆ మార్పు వెనకాలవున్న చిట్టిబాబు పోలికలు తన కళ్ళకు స్పష్టంగా కనబడుతున్నాయి. కళ్ళజోళ్ళు సవరించుకుని మరీ మరీ చూసింది. అవును చిట్టిబాబే అని నిర్ధారణ చేసుకుంది. ఆమె మనోసాగరంలో సంతోషపు టలలు అంతెత్తున లేచాయి. 'మళ్ళా ఎన్నేళ్ళకు కనిపించాడు బాబు' అనుకుని పొంగిపోతుంది. ఇంతలో అతను కదిలాడు. ఆ కదలటంలో అతని కాలు, తన కాలుకి తగిలింది. చటుక్కున ఆమెను చూస్తూ, "క్షమించండి" అంటూ ఆమె కాలు తాకి కళ్ళకి అద్దుకున్నాడు.

"ఫరవాలేదు బాబూ" అంది తాను తదేకంగా అతన్నే చూస్తూ. అతనూ తనని బాగానే చూశాడు. కానీ, కానీ 'అత్తా' అనడేం? 'ఎన్నాళ్ళకి కనిపించారత్తా' అంటూ ఆశ్చర్యపోడేం? అన్ని సంగతులూ వివరించడేం? చిట్టిబాబు తనని మరిచిపోయాడా? లేక యితను చిట్టిబాబు కాడా?

అనుమానాలతో జానకమ్మ మనసులో లేచిన సంతోషపు టలలు నేలమట్టమయ్యాయి! బాధతో మూగదై పోయింది.

ఆ రాత్రి రైల్లో ఎదురెదురు 'బెర్త్'లలో జానకమ్మ, చిట్టిబాబు పక్కలు సర్దుకున్నారు. ఏదో అప్పుడప్పుడు అవసరమైన చిన్న చిన్న సాయం చేస్తున్నాడుగానీ, ఆమెను గుర్తుపట్టలేకపోయాడు చిట్టిబాబు. హాయిగా నిద్రపోయాడు అరగంటలో. కానీ జానకమ్మ అతన్నే చూస్తూ, జాగారం చేసేసింది?

తెల్లవారింది. గమ్యం దగ్గరౌతూంది. దిగేముందన్నా, ఏదేదో అడిగేయాలని ఆమె మనసు వుబలాటపడింది కానీ, అడగలేకపోయింది. పాత జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ, కదిలినప్పుడల్లా ఓ మాటు చిట్టిబాబుని చూస్తూ కూర్చుంది మౌనంగా.

దిగాల్సిన స్టేషన్ వచ్చేసింది.

కిటికీగుండా తాను తన కొడుకు కోసం చూడసాగింది. "హాయ్ చిట్టిబాబు" అన్న గొంతుక విని అదిరిపడింది జానకమ్మ.

"హాయ్" అంటూ, ఆ వ్యక్తికి

చేయూపుతున్నాడు తన ఎదురుగా కూర్చున్న చిట్టిబాబు!

"అయితే, యితను చిట్టిబాబే" అనుకుంది. ఆమె కంటి ముందు ఆరేళ్ళ చిట్టిబాబు నిలిచాడు. కానీ, యిప్పుడు ఎంత పెద్దవాడయ్యాడు! ఎంత పొడవు! పొడవుకి తగ్గ లావు! మంచి ఖరీదైన బట్టలు తొడిగాడు. ఖరీదైన 'సూట్ కేస్'ని అందుకుంటున్నాడు! జానకమ్మ మనస్సులో ఆనందతరంగాలు, ఆమెను గిరగిరా తిప్పేస్తున్నాయి.

ఇప్పుడు యితను చిట్టిబాబే అని నిర్ధారణ అయిపోయింది. తానెవరో అతనితో చెప్పాలి. అతని గురించి అన్ని విషయలూ తెలుసుకోవాలని జానకమ్మ తొందరపడింది.

"చిట్టిబాబు" అని పిలువబోయింది. అతను తనని దాటి, "వస్తానండి" అని తనకు చెప్పి వెళిపోయాడు. జానకమ్మ నీరు గారిపోయింది!

"అమ్మా" అన్న పిలుపుకి యిటు తిరిగింది.

తన కొడుకు, తను రక్తం పంచి యిచ్చిన కొడుకు కనిపించాడు. "బాబూ వచ్చావా?" అంటూ సామాన్లు సర్దుకుని రైలు దిగింది జానకమ్మ. ఉత్సాహం వచ్చినట్టు అయింది.

కానీ, జానకమ్మ మనస్సులో నిరుత్సాహం కూడ ఓ మూల వున్నట్టుగా వుంది. ఎందుకు? చిట్టిబాబుతో మాట్లాడలేదనా? ఒకవేళ మాట్లాడినా, తానెవరో చెప్పినా, 'అలాగా' అని హుందాగా పరామర్శించి వెళిపోయే వాడేమో! తానెంత తాపత్రయపడిందీ అతనికేం తెలుసు? కానీ, తన సాయం లేకుండానే యింత ఎదిగిపోయాడు. ఆ రోజుల్లో చిట్టిబాబుకి తానెంత ఆసరా యివ్వాలనుకున్నా యివ్వలేకపోయింది. దగ్గరకు చేరదీసినంత మాత్రాన, అతను తనని పూజించాలా? పిల్లలన్న సరదావున్న ఎవరైనా చేస్తారా పని. తానెందుకింత బాధపడాలి అనుకుంటూ ఓ అసంతృప్తితో, టాక్సీ ఎక్కింది జానకమ్మ. కానీ, ఆ అసంతృప్తి ఎంతో సేపు నిలవలేదు. తనను తాను సర్దు కుంది జానకమ్మ. "ఎందుకు? నేనెందుకు అసంతృప్తినొందాలి. నా ఆశీర్వాద బలమే నేడు చిట్టిబాబు యింత వాడయ్యాడు. నిండుమనసుతో దీవించింది కాబట్టే, చిట్టిబాబు పెద్ద వుద్యోగస్థుడయ్యాడు. నాకు పుట్టినది యిద్దరు కొడుకులైతే, చిట్టిబాబు నా మూడవ బిడ్డ. నా కొడుకులు ముగ్గురూ యీ రోజు ఎంతో గొప్పగా వున్నారు" అనుకుని, కళ్ళజోళ్ళు తీసి, కళ్ళు తుడుచుకుంది జానకమ్మ!

---